సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం | 13 | జూన్ | 2024



సస్యరక్షణతో మామిడిలో లాభాలు

సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారానే మామిడిలో లాభలు గడించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

8లో ▸



పశ్రుగాసం కొరత రాకుండా..

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పశు గ్రాసం కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయాధికారులు **పాడి రైతులకు వివరిస్తున్నారు.**

8లో ▸



కూటమి దాడులు తగదు

విపసంస్కృతితో కూటమి నేతలు దౌడులకు పాల్పడటం తగదని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు.

8లో ▸

న్యూస్‌రీల్

వసతిగృహాల్లో సౌకర్యాలపై అవగాహన పెంచండి



సదస్సులో మాట్లాడుతున్న కె.బాలుసాధన

నరసాపురం: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై అవగాహన కల్పించి నూరుశాతం అడ్మిషన్లను సాధించాలని సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.బాలు సాధన సూచించారు. బుధవారం వైఎస్ కళాశాలలో కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకులకు వసతి గృహాల్లో విద్యార్థుల చేరికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు సాధన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి వెళ్లి వసతి గృహాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటి కన్నా హాస్టల్ మెరుగు అనే భావన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌వీఎస్ సాయిబాబా, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

117 జీవో రద్దు చేయాలి



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసి వెంటనే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ అన్నారు. బుధవారం భీమవరంలోని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మొదటి కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. 12వ పీఆర్సీ ప్రకటిస్తూ ఐఆర్ ఇవ్వాలని, పీఆర్సీ కమిటీని నియమించాలని, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయ డైరీని సాయి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, సాయివర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.రామచంద్రరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పీవీడీ ప్రసాద్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

15న ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ (ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు, ఏపీ అంతటా)లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు కలవన్నారు. నెలకు జీతం రూ.12,500తో పాటు రవాణా అలవెన్స్, ఇన్సెంటివ్స్, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇంటర్/డిగ్రీ విద్యార్హత కలిగి, బ్యాంకింగ్/ఫైనాన్స్ రంగంలో అనుభవం కలిగి ఉండాలన్నారు. ఫ్రెషర్స్ కూడా అర్హులేనని, వయస్సు 21 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. మోహన్ స్పిన్‌టెక్స్, మల్లపల్లి, హనుమాన్ జంక్షన్‌లో పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గార్డ్స్ (పురుషులు) పోస్టులకు 8వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హతతో 18–35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని, జీతం నెలకు రూ.11 వేల నుంచి రూ.13 వేలు చెల్లిస్తారన్నారు. ఇతర వివరాలకు 88868 82032 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


పాఠశాలల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని వెయ్యి పాఠశాలల్లో సంస్కృతాన్ని కొనసాగిస్తూ, అన్ని పాఠశాలల్లోనూ సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్‌వీకే రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథి రాజ్‌కుమార్ మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లలో పీజీటీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి బీఎస్ఎన్‌కే కల్యాణి, ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సతీష్, ఆర్.శ్యామ్‌సుందర్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ రెడ్డి, వీకేఎస్ ఫణికుమార్ పాల్గొన్నారు.

జిల్లాకో మంత్రి పదవి

- ఏలూరు జిల్లా నుంచి మంత్రిగా కొలుసు పార్థసారథి
- పశ్చిమగోదావరి నుంచి మంత్రిగా నిమ్మలకు స్థానం
- సీనియర్ ఎమ్మెల్యేలు పితాని, చింతమనేనికి మొండిచేయి
- జనసేన, బీజేపీ నేతలకు దక్కని మంత్రి పదవులు





మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: నూతన ప్రభుత్వంలో జిల్లాకో మంత్రి పదవి దక్కింది. ఏలూరు జిల్లా నుంచి నూజివీడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కొలుసు పార్థసారథికి, పశ్చిమగోదావరి జిల్లా నుంచి పాలకొల్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నిమ్మల రామానాయుడుకు కేబినెట్‌లో చోటు దక్కింది. ఈ మేరకు బుధవారం ఇద్దరు నేతలు చంద్రబాబు కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సామాజిక సమీకరణాలు, పార్టీలో సీనియార్టీ ప్రాతిపదికన, హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఉన్న నిమ్మలకు అవకాశం దక్కగా, నూజివీడు నుంచి గెలుపొందిన పార్థసారథికి అనూహ్యంగా బీసీ కోటాలో మంత్రి పదవి దక్కింది. టీడీపీలో సీనియర్లుగా ఉన్న పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్లకు మరోసారి మొండిచెయ్యి చూపడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిమ్మల

కూటమి ప్రభుత్వం కొలువుతీరిన క్రమంలో మంత్రివర్గ జాబితాలో ఒక్కొక్క జిల్లా నుంచి ఒక్కొక్కరికి ప్రాధాన్యం దక్కింది. ఇద్దరూ రాజకీయంగా సీనియర్ నేతలే అయినప్పటికీ నిమ్మల మొదటి నుంచి టీడీపీలోనే కొనసాగుతుండగా పార్థసారథి మాత్రం 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి నిమ్మల రామానాయుడు 2014, 2019, 2024 వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికల్లో పాలకొల్లు నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. వృత్తిరీత్యా నర్సాపురం వైఎన్ కళాశాలలో పదేళ్ల పాటు అధ్యాపకునిగా పనిచేశారు. 2007లో జరిగిన ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తరువాత నుంచి 2014లో సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని నిమ్మల రామానాయుడుకు టికెట్ కేటాయించడంతో త్రిముఖ పోటీలో విజయం సాధించారు. 2019లోనూ మళ్లీ గెలుపొందారు. ఈ పర్యాయం మూడోసారి గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఖ్యాతిగడించారు. నిమ్మల తన తండ్రి ధర్మారావు ఫౌండేషన్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సీనియర్లకు మొండిచేయి

తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్న పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్‌కు మొండిచేయి చూపారు. పితాని సత్యనారాయణ ఆచంట నుంచి గతంలో గెలుపొంది వైఎస్సార్ కేబినెట్‌లో, ఆ తరువాత చంద్రబాబు కేబినెట్‌లోనూ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ సీనియర్ నేతగానూ గుర్తింపు ఉంది. ఈ క్రమంలో ఆయనకు తప్పనిసరిగా అవకాశం దక్కుతుందని భావించారు. అయితే అనూహ్యంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇదే సామాజిక వర్గానికి చెందిన వాసంశెట్టి గణేష్‌కు మంత్రి పదవి దక్కింది. ఈ క్రమంలో పితాని ఆశలు గల్లంతయ్యాయి. ఇక ఏలూరు జిల్లాలోని సీనియర్ నేతగా చింతమనేని ప్రభాకర్ కొనసాగుతున్నారు. 2009, 2014లో వరుసగా రెండు పర్యాయాలు టీడీపీ నుంచి గెలిచి 2014లో కేబినెట్ హోదా కలిగినటు వంటి ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. మళ్లీ మూడో పర్యాయం గెలుపొందారు. అయితే సామాజిక సమీకరణాల దృష్ట్యా చింతమనేనికి మొండిచెయ్యి చూపినట్లు సమాచారం. దీంతో అనూహ్యంగా కొలుసు పార్థసారథిని ఎంపిక చేశారు.

కాంగ్రెస్‌లో కొలుసు రాజకీయ ప్రస్థానం ప్రారంభం

ఇక ఏలూరు జిల్లా నుంచి ఎన్నికైన కొలుసు పార్థసారథి రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్‌లో ప్రారంభమైంది. పార్థసారథి తండ్రి కేపీ రెడ్డయ్య మచిలీపట్నం పార్లమెంట్ నుంచి 1991, 1996 ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందారు. ఆయన రాజకీయ వారసుడుగా ఆయన కుమారుడు కొలుసు పార్థసారథి 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఉయ్యూరు కాంగ్రెస్ అభ్యర్థిగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గెలుపొందారు. 2009లో నియోజకవర్గ పునర్విభజనతో ఉయ్యూరు రద్దు కావడంతో పెనమలూరు నియోజకవర్గం నుంచి 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2014లో ఓటమి పాలయ్యారు. మళ్లీ 2019లో పెనమలూరు వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. వైఎస్సార్ ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ మంత్రి, ఆ తరువాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మాధ్యమిక విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2024లో ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరి నూజివీడు నుంచి గెలుపొందారు. చివరి నిమిషంలో పార్టీ మారి టికెట్ దక్కించుకుని మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం విశేషం.

31 ఏళ్ల తరువాత నూజివీడుకు మంత్రి పదవి

నూజివీడు నియోజకవర్గానికి 31 ఏళ్ల తరువాత మంత్రి పదవి వరించింది. గతంలో నూజివీడు నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎమ్మార్ అప్పారావు, రెండుసార్లు ఎన్నికైన పాలడుగు వెంకట్రావు ఇక్కడ మంత్రులుగా పనిచేశారు. పాలడుగు వెంకట్రావు నేదురుమల్లి జనార్దనరెడ్డి మంత్రి వర్గంలో 1993 వరకు మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు 31 ఏళ్లలో నూజివీడుకు మంత్రి పదవి లభించలేదు. తాజాగా పెనమలూరు నుంచి నూజివీడు వచ్చి పోటీ చేసి గెలుపొందిన కొలుసు పార్థసారథిని మంత్రి పదవి వరించింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి



పీహెచ్‌సీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను ప్రోత్సహించేలా వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని పీహెచ్‌సీల వైద్య అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీలు, మలేరియా, డెంగీ సీజనల్ వ్యాధులు, రక్తహీనత, పీఎంఈవై, ఈజేఎస్‌వై, మందుల నిల్వలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నూరు శాతం డెలివరీలు జరగాలని, తక్కువగా డెలివరీలు జరుగుతున్న ఆస్పత్రులను సమీక్షించుకుని తగిన చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు సూచించారు. రోగుల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకోవాలన్నారు. రక్తహీనతకు సంబంధించి ఐరన్ టాబ్లెట్లు, ఇంజెక్షన్లను రోగులు తీసుకుంటున్నారో లేదో సమాచారాన్ని తీసుకుని సమీక్షించాలన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వివరాలను అప్‌డేట్ చేసి చెక్ చేసుకోవాలన్నారు. జిల్లాలో మందుల నిల్వలపై ఎప్పటికప్పుడు అవసరమైన వాటికి ఇండెంట్ పెట్టాలన్నారు. డెంగీ నివారణకు చర్యలు తీసుకుని, చిన్నారులకు సోకకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డెంగీ సోకిన రోగులకు తక్షణమే చికిత్స అందించాలన్నారు. మలేరియ, డెంగ్యూ వ్యాధులపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దోమలను అరికట్టాలంటే పారిశుద్ధ్యం చేపట్టవలసిన ప్రాంతాలను గుర్తించి తెలియజేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణరావు, డీపీఎంఓ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి



వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

- కార్యకర్తలకు అండగా ఉండండి
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మిలకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నిర్దేశం

బుట్టాయగూడెం: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని, అదేవిధంగా కార్యకర్తలకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గంలో అధికార టీడీపీ, జనసేన శ్రేణులు చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓటమి పాలు కావడానికి కారణాలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై జగన్‌కు వివరించారు. అలాగే సోషల్ మీడియా నాయకులపై వస్తున్న బెదిరింపులపై కూడా వివరించారు. గెలుపోటములు శాశ్వతం కాదని, ఓటమి ఎదురైనా ధైర్యంగా నిలబడాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ తమకు సూచించారని బాలరాజు తెలిపారు. ఎవరూ భయపడవలసిన అవసరం లేదని, ప్రజా తీర్పును గౌరవిస్తూనే పోరాటం చెయ్యడమే తమ ముందున్న కర్తవ్యమని జగనన్న దిశానిర్దేశం చేసినట్లు బాలరాజు తెలిపారు. అలాగే ప్రతి బాధితుడిని ప్రత్యక్ష్యంగా కలుస్తానని ఆయన చెప్పినట్లు బాలరాజు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారికి తమ కుటుంబం కూడా అండగా ఉంటుందని బాలరాజు, రాజ్యలక్ష్మి తెలిపారు.

చదువుతోనే బాలలకు మంచి భవిష్యత్

భీమవరం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి అనంతరం మాట్లాడారు. బాలలు బడికి వెళ్లి చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, అందువల్ల బాలలు పనికి కాకుండా బడిలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఇళ్లు, ఫ్యాక్టరీలు, దుకాణాలు, హోటళ్లు తదితర ప్రదేశాల్లో బాలలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే కార్మిక శాఖకు తెలియజేయాలన్నారు. బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకునే యాజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక, రెవెన్యూ, అంగన్‌వాడీ, స్త్రీశిశు సంక్షేమం, బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి మూడు రోజులపాటు అన్ని మండలంలోని ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలు, షాపులు, హోటళ్లను తనిఖీ చేసి బాల కార్మికులను గుర్తిస్తే అవగాహన కల్పించడంతోపాటు, బడిలో చర్పేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్‌పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖాధికారిణి ఆకన లక్ష్మి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖాధికారిణి బి సుజాతరాణి, సాంఘిక సంక్షేమశాఖాధికారిణి కె.శోభారాణి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, దిశా పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీలక్ష్మి, పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



భీమవరంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ముగిసిన ఓపెన్ ఇంటర్ ప్రయోగ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యావిధానంలో ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన విద్యార్థులకు నిర్వహిస్తున్న సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. భౌతికశాస్త్రం ప్రయోగ పరీక్షకు 14 మంది విద్యార్థులకు గాను ఏడుగురు హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. అలాగే రసాయన శాస్త్రం పరీక్షకు 25 మందికి గాను 18 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. చివరి రోజు పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఆధునిక కవిత్వ వికాసంపై సదస్సు



తణుకులో గణేష్‌ను ఘనంగా సత్కరిస్తున్న అధ్యాపకులు

తణుకు టౌన్: తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాలలో బుధవారం 'ఆధునిక కవిత్వ వికాసం' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్ కుమార్ అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జర్మనీలో ఎస్ఆర్‌హెచ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి.శ్రీగణేష్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎన్‌వీ కృష్ణారావు మాట్లాడుతూ వ్యక్తికి, వ్యవస్థకు మధ్య జరిగేదే కవిత్వమన్నారు. ఆధునిక కవిత్వ ప్రక్రియలలో రవ్వలు అనే ప్రక్రియ విశిష్టతను తెలియజేశారు. ప్రొఫెసర్ టి.శ్రీగణేష్ మాట్లాడుతూ స్వభాష గౌరవం, మాతృభాష గొప్పదనాన్ని చాటి చెప్పారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహ ఆచార్యులు డాక్టర్ పి.విజయకుమార్, రాజమండ్రి ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర.) తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ, తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎస్.గోపాలయ్య ప్రసంగించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా కళాశాల తెలుగు శాఖాధిపతి డి.కనకమహాలక్ష్మి, సహ సమన్వయకర్తగా బీఎస్ఎల్ పద్మశ్రీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ పాల్గొన్నారు.

యాంటీభయాటిక్స్

- జిల్లాలో అతిగా యాంటీబయోటిక్స్ వాడకం
- సాధారణ జబ్బులకు సైతం ఇవే వినియోగం
- అనివార్యమైతే వైద్యుల సిఫారసుతోనే వాడాలి



తణుకు: అసలే ఉరుకుల పరుగుల జీవితం.. ఆపై ఆహార అలవాట్లలో మార్పులు.. ఈ పరిస్థితుల్లో నిత్యం ఏదోక అనారోగ్య సమస్యకు గురైతే ఆందోళన గురై అవగాహన లేమితో యాంటీబయోటిక్స్ మందులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఎలాంటి నలత ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న యాంటీబయోటిక్స్ మింగేస్తున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం పదే పదే ఈ మందులు వాడకం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు కొందరు ఆర్ఎంపీలు సైతం చీటికీ మాటికీ యాంటీబయాటిక్స్ వాడిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధుల వారిన పడుతున్నారు. దీంతో శరీరంలో సహజసిద్ధంగా ఉండే రోగనిరోధక శక్తి దెబ్బతింటోంది.

అధికారుల దృష్టి ఏదీ?

తల, నడుం, కీళ్ల నొప్పులకు సొంత నిర్ణయాలతో ఓ పెయిన్ కిల్లర్ మాత్ర వేసుకోవడం ఇప్పుడు పరిపాటైంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల పెయిన్ కిల్లర్స్ అతిగా వాడిన కొందరు అనారోగ్యం బారినపడి ఆసుపత్రుల్లో ఇన్ పేషెంట్లుగా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే మందుల దుకాణాల వద్ద సైతం వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే యాంటీబయోటిక్స్ నేరుగా తెచ్చుకుని మరీ వాడేస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి, నడుంనొప్పి, చర్మవ్యాధులు ఇలా ఏ జబ్బుకైనా యాంటీబయోటిక్స్ తెగ వాడేస్తున్నారు. ముఖ్యంగా పెయిన్ కిల్లర్లతో కిడ్నీ, గుండె, కాలేయంపై ప్రభావం చూపుతుండటంపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. దీనికోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏడాదికి రూ.కోటి విలువైన మాత్రల విక్రయం?

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2 వేల వరకు మందుల దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.కోటి విలువైన యాంటీబయోటిక్స్ మాత్రలను విక్రయిస్తున్నట్లు సమాచారం. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే దుకాణదారులు మందులు విక్రయిస్తున్నారు. వైద్యులు సూచించిన మందుల చీటీ లేనిదే మందులు విక్రయించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడంలేదు. సాధారణంగా కోవిడ్ సమయంలో అవసరం ఉన్నా లేకున్నా ఎక్కువ మోతాదులో యాంటీబయోటిక్స్ మందులపై ఆధారపడుతున్నారు. అప్పటి నుంచి ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడల్లా వైద్యుల సూచనలు లేకుండానే యాంటీబయాటిక్స్ మందులను విచ్చలవిడిగా కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. అయితే వీటి అమ్మకాలపైనా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మందుల దుకాణాల్లో నేరుగా అమ్మకాలు జరుగుతున్నాయి.

అధిక వినియోగం తగదు



ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నివారణ కోసం మందులు ఎక్కువగా వాడకుండా ఉండటం మేలు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తక్షణ నివారణ కోసం యాంటీబయోటిక్స్ మందులు ఇటీవల కాలంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీని వల్ల కిడ్నీ, కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. వైద్యుల సిఫార్సుతో మాత్రమే పరిమితులకు లోబడి యాంటీబయోటిక్స్ మందులు వేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.శోభాశరణ్, ఎండీ, జనరల్ ఫిజీషియన్ (ఫిలిప్పెన్స్), తణుకు

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


అరిపాక హరీష్ (ఫైల్)

తణుకు: వ్యక్తి అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఆలమూరి వారి వీధిలో నివాసం ఉంటున్న అరిపాక హరీష్ ఈనెల 11న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి తన భార్య జయశ్రీకు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన జయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసిందని చెప్పారు. బంగారు ఆభరణాలు తయారు చేసుకుంటూ జీవించే హరీష్‌కు ఎలాంటి అప్పులు లేకపోగా గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే


ఉరదాళ్లపాలెంలో సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల సర్వే చేస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

అత్తిలి: అత్తిలి మండలంలో నిర్వహించిన సర్వేలో ప్రత్యేక అవసరాల పిల్లలను 60 మందిని గుర్తించినట్లు జిల్లా సమగ్రశిక్ష ఐఈ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఉరదాళ్లపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించడం ద్వారా వారికి ప్రభుత్వపరంగా వివిధ రకాల అలవెన్సులతోపాటు వారికి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు భవిత కేంద్రాలలో ఫిజియోథెరపీ సేవలు కూడా అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ పి శ్రీనివాసరావు, ఎంఈవోలు ఎస్ రమేష్, ఎంవీఎల్‌కే ప్రసాద్, ఐఈఆర్టీ ఉపాధ్యాయిలు కేఎస్ రమ్య, యేసురాజు పాల్గొన్నారు.

రైలెక్కుతుండగా కాలుజారి..


భీమవరంలో రైలు - ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీస్తున్న దృశ్యం

భీమవరం: ప్రమాదవశాత్తు రైల్వే ప్లాట్ ఫామ్, రైలు మధ్య ఇరుక్కుపోయిన వ్యక్తి అదృష్టం కొద్ది బతికి బయటపడ్డాడు. వివరాల ప్రకారం.. నరసాపురం నుంచి విజయవాడ వైపు వెళుతున్న రైలు బుధవారం మధ్యాహ్నం భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌కు చేరింది. ఆ సమయంలో ఒక వ్యక్తి రైలెక్కబోయి కాలుజారి రైలు - ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుపోయాడు. పరిస్థితిని రైల్వే డ్రైవర్ గమనించి రైలు ముందుకు వెళ్లకుండా నిలిపివేశాడు. వెంటనే అక్కడే ఉన్న ఆర్‌పీఎఫ్, పోర్టర్ సిబ్బంది గునపంతో ప్లాట్‌ఫామ్‌ను తవ్వి ఆ వ్యక్తిని బయటకు తీసి సపర్యలు చేశారు. అతనికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం నుంచి బయటపడ్డ వ్యక్తి వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనతో రైలు 20 నిమిషాల ఆలస్యంగా బయలుదేరింది.

యాజమాన్య పద్ధతులతో లాభసాటిగా మామిడి


సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సిన మామిడితోట


దుక్కి దున్నిన మామిడితోట

నూజివీడు: పండ్లలో రారాజు మామిడి. మామిడి పండ్ల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల హెక్టార్‌లలో సాగు చేస్తూ ఉత్పత్తిలోనూ అగ్ర స్థానంలోనే ఉన్నాం. కోత అనంతరం తీసుకోవాల్సిన, పాటించాల్సిన పద్ధతులను రైతులకు వివరిస్తున్నారు నూజివీడు ఉద్యాన అధికారిణి ఆర్ హేమ. జూన్ నుంచే సరైన యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే మామిడి పంట లాభదాయకంగా ఉంటుందని ఆమె పేర్కొంటున్నారు.

కొమ్మ కత్తిరింపులు

చెట్లకు ఉన్న ముదురు కొమ్మలను, కాపుకాయని ముదురు కొమ్మలు, లోపల అడ్డదిడ్డంగా పెరుగుతున్న కొమ్మలను కత్తిరించాలి. ఈ విధంగా చేయడం వల్ల చెట్టు లోపలికి గాలి, వెలుతురు సోకి కొత్త చిగురులు ఎక్కువగా వచ్చి వాటిపై పూత బాగా వస్తుంది. అంతేగాక మంగు కలిగించే తేనెమంచు పురుగులు నియంత్రించబడతాయి. కొమ్మలను నరికిన చోట బోర్డోపేస్టును పూతగా పూసినట్లయితే శిలీంద్రాలను ఆశించకుండా నివారించవచ్చు.

తోటల్లో దుక్కిదున్నడం వలన..

వర్షపు జల్లులు పడగానే మామిడితోటలలో పదును చూసి దున్నుకోవాలి. తోటల్లో సకాలంలో దుక్కి దున్నడం ద్వారా నేల, గాలి, నీటి సరఫరాకు అనుకూలంగా ఉంటుంది. అంతేగాక రసం పీల్చు పురుగులు, ఆకుతినే పురుగులు, ఆకుమచ్చ తెగుళ్లకు కారకులైన శిలీంద్రాలకు ఆశ్రయం ఇచ్చే కలుపు మొక్కలను నివారించవచ్చు. అలాగే చెట్టు కొమ్మలు ఎంత వరకు విస్తరించి ఉన్నాయో అంతవరకు చెట్టు చుట్టూ పాదులు చేసుకోవాలి.

సేంద్రియ ఎరువుల వాడకం

తొలకరి జల్లులు పడిన వెంటనే దుక్కి దున్నిన తరువాత పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని 60 రోజుల తరువాత నేలలో పచ్చిరొట్ట పంటను కలియదున్నాలి. అలాగే పశువుల ఎరువు 50 కిలోలు ఒక చెట్టుకు లేదా వర్మీకంపోస్ట్ లేదా వేప పిండిని 5 నుంచి 10 కిలోలు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే చెట్లకు నీటిని పెట్టాలి. మంచి జడి వానలు పడినట్లయితే నీటిని పెట్టనవసరం లేదు. ప్రధాన సూక్ష్మపోషకాలైన బోరాన్, జింక్, మెగ్నీషియం మామిడి పంటకు చాలా అవసరం. బోరాన్ ధాతువు పూతలో ఆడపుష్పాలు రావడానికి, పూత ఎక్కువ రోజులు నిలుచుటకు, ఫలదీకరణ బాగా జరగడానికి తోడ్పడుతుంది. బోరాక్స్ రూపంలో ఒక చెట్టుకు 50 నుంచి 75 గ్రాములు భూమిలో కలిపి దున్నడం మంచిది. జింక్ సల్ఫేట్ 150 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 150 గ్రాములు చొప్పున చెట్టు పాదుల్లో వేసి నీరు పెట్టాలి.

చెదపుట్టలను నిర్లక్ష్యం చేయవద్దు

కొన్ని తోటలలో మామిడి చెట్ల మొదళ్లలో చెదపుట్టలు వస్తాయి. కాండంపైనే కాకుండా వేర్లలో కూడా చెదగూళ్లు వ్యాపిస్తాయి. దీంతో చెట్టు క్రమేణా క్షీణించి చనిపోతాయి. దీనికి గాను కాండంపై ఉన్న చెదగూళ్లను గోనెసంచితో రుద్ది తొలగించాలి. తర్వాత కాండంపై ఒక మీటరు ఎత్తు వరకు ఇంజన్ ఆయిల్ మడ్డిని పూతగా పూయాలి. వేపనూనెను 50 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి కూడా పూతగా వేయవచ్చు. తోటలో ఉన్న చెదపుట్టలను తవ్వివేసి భూమిలో ఉన్న చెదపురుగులను కూడా నాశనం చేయాలి.

సస్యరక్షణ ఇలా..

తేనెమంచు పురుగులు, రాతిమంగు, ఆకుమచ్చ తెగుళ్లను నివారించడానికి రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. లేతచిగుర్లను, ఆకులను కొరికి తినే పురుగులు, ఆకుగూడు పురుగులు, కాండం పగుళ్లలో నివసించే తేనెమంచు పురుగులు తదితర వాటిని నియంత్రించడానికి కార్బారిల్ 3 గ్రాములు లేదా థయోడికార్బ్‌ను 2 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి ఆకులు, కొమ్మలు, కాండం మొదళ్లపై పగుళ్లు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. ముడ్డిపుచ్చు పురుగు ఆశించి రాలిన కాయలను, ఎండిన కాయలను తోటలలో లేకుండా ఏరి కాల్చివేయాలి. ఆంత్రక్నోస్ తెగులు సోకి రాలిన ఆకులను చెట్టు కింద ఉంచకుండా పోగుచేసి కాల్చివేయాలి. ఇలా చేయడం వల్ల దానికి సంబంధించిన శిలీంధ్ర బీజాలు మరలా చెట్టుపై ఆకులను ఆశించకుండా నియంత్రించడానికి వీలవుతుంది.

ఏపీ ఈఏపీ సెట్‌లో 'తిరుమల' జయకేతనం


విద్యార్థులకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షా ఫలితాల్లో భీమవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో బైపీసీ విభాగంలో జీఎస్ కృష్ణశ్రీ 64వ ర్యాంకు, డీఎస్ సద్గురుశ్రీ 217, డి.హాసినిప్రియ 287, పీఆర్ఎస్ శ్రీలక్ష్మి 323, ఎస్‌వీ నమస్విత్‌శ్రీ 380, ఎల్ఎస్ వెంకటసాయి 413, ఆర్ సంజీవ్ 541, ఎస్ మణిశంకర్ 847వ ర్యాంకులు సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపీసీ విభాగంలో కేఎస్‌టి అనురూప్ రెడ్డి 189, వీఆర్ చరణ్ వర్మ 202, మాదిరెడ్డి ఆదిత్య సాయినాయుడు 266, డి.సాయిసత్య 272, పి.హర్షవర్ధన్ 390, బీఎస్ అఖిల్‌రాజీవ్ 399, వీబీకే ప్రవీణ్ వర్మ 441, కేజేఎస్ సంతోష్‌బాబు 456, ఎంఎం రామ్‌ప్రణవ్ 462, టీఎస్ఎస్ చంద్రరావు 471వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ర్యాంకర్లను స్థానిక కళాశాలలో తిరుమలరావుతోపాటు విద్యాసంస్థ డైరెక్టర్లు ఎస్ సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.నతీష్‌బాబు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందిచారు.

టీడీపీ కూటమి దాడులు తగదు

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు


జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల నిరసన

జంగారెడ్డిగూడెం: టీడీపీ కూటమి దాడులకు పాల్పడడం తగదని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ నేమ్ బోర్డును టీడీపీ శ్రేణులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం అని, కానీ టీడీపీ కూటమి ఇలాంటి దారుణాలకు పాల్పడడం విష సంస్కృతికి నిదర్శనమని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను సమానంగా ఆదరిస్తే.. టీడీపీ కూటమి గెలవగానే దౌర్జన్యాలు చేస్తుండడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రజలకు మీకు కల్పించిన అవకాశంతో మంచి పనులు చేయాలేగాని, ప్రతిపక్షంపై దాడులు కాదన్నారు. ఎ.పోలవరం, లక్కవరం తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు పాల్పడ్డారని, ఇలాగే దుందుడుకు చర్యలకు పాల్పడితే ప్రజలే శిక్ష విధిస్తారని హెచ్చరించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గతంలో జరిగిన తప్పొప్పులు బేరీజు చేసుకుని, ప్రజల మన్ననలు పొందేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు జెట్టి గురునాధరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ నేమ్ బోర్డును టీడీపీ శ్రేణులు ధ్వంసం చేయడాన్ని ఖండించారు. ఇందుకు కారణమైన దోషులను శిక్షించాలన్నారు. కాగా కౌన్సిల్ సభ్యులు కలిసిమెలిసి ఉండి, పట్టణాభివృద్ధి కృషిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా ప్రచారక మిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, పామర్రు నియోజకవర్గ పరిశీలకుడు మండవల్లి విజయసారథి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంపై దాడి చేసిన ఘటనపై ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేడవరపు విద్యాసాగర్, పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, కౌన్సిలర్‌లు మానవత మూర్తి, ఎల్‌వీఆర్, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, కనుమూరి లావణ్య, నేట్రు సుబ్బలక్ష్మి, ముప్పాని రమణ, కోఆప్షన్ వెంజ ఐజి, నాయకులు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

చీరాల: సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన యువకుడు అలల తాకిడికి గల్లంతై మృతి చెందిన సంఘటన బుధవారం రామాపురం బీచ్‌లో చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెంకు చెందిన గిరీష్ (21) బుధవారం రామాపురం బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి గురై గల్లంతయ్యాడు. కొద్ది సమయానికే అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. సమాచారం అందుకున్న వేటపాలెం పోలీసులు మృతుడి వివరాలను నమోదు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు


భీమవరంలో అనాథ మృతదేహాన్ని అంతిమ సంస్కారాలకు తీసుకువెళుతున్న దృశ్యం

భీమవరం: అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించి భీమవరం మానవతా సాంఘిక సేవాసంస్థ ఉదారతను చాటుకుంది. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీప్రసన్న శిరిడిసాయిబాబా ఆలయం సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు మానవతా సాంఘిక సేవాసంస్థకు సమాచారం వచ్చింది. దీనితో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధరాజు వెంకటపతిరాజు, కార్మూరి నర్సింహమూర్తి చొరవతో మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవ సంబంధాలు రోజురోజుకు తగ్గిపోతున్న తరుణంలో రాబోయే తరానికి వాటి విలువలను తెలియజెప్పాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అల్లు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం


క్యాడెట్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ


క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

19 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ

పెదవేగి : దేశాభివృద్ధి యువతతోనే సాధ్యపడుతుందని 19 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ అన్నారు. పెదవేగి మండలం ఎంఆర్‌సీ కాలనీలోని స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ శిబిరంలో కాకినాడ గ్రూపునకు చెందిన పలు యూనిట్ల నుంచి మొత్తం 524 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ఈ శిబిరంలో క్యాడెట్లకు వెపన్ ఫైరింగ్, డ్రిల్ వంటి అంశాల్లో శిక్షణతో పాటు ట్రాఫిక్ ర్యాలీ, హెచ్ఐవీ ఎయిడ్స్, ప్రకృతి, అటవీ సంరక్షణ, కేన్సర్, స్వచ్ఛభారత్, రక్తదానంపై అవగాహన కల్పించారు. వీటితో పాటు ఈ క్యాంప్‌లో ఆత్మస్థైర్యం క్రమశిక్షణ, ఐకమత్యం, సవాళ్లను స్వీకరించే పోటీతత్వం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై కూడా శిక్షణ ఇచ్చారు. క్యాడెట్లు జాతీయ సమైక్యత, సేవాభావం అలవర్చుకుని సమాజంపై బాధ్యత పెంపొందించుకోవాలని కల్నల్ సౌరబ్ ముఖర్జీ సూచించారు. అనంతరం పలు రకాల పోటీల్లో గెలుపొందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఫస్ట్ ఆఫీసర్ భీమేశ్వరరావు, సెకండ్ ఆఫీసర్ జి గవరయ్య, ఇతర ఎన్‌సీసీ అధికారులు, ఆర్మీ ట్రెయినింగ్ జేసీఓ, ఎన్‌సీఓ సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా రెడ్‌క్రాస్


చిన్నారులకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందజేస్తున్న రెడ్‌క్రాస్ అధికారులు, దాత అఖిల్‌రెడ్డి

ఏలూరు టౌన్: తలసేమియా వ్యాధి బాధిత చిన్నారులకు ప్రతి వారం రక్తమార్పిడి చికిత్స అందిస్తూ రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలుస్తోందని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో 11 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చితే రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. తలసేమియా, కేన్సర్, డయాలసిస్, ప్రసూతి స్త్రీలకు, ఆపరేషన్లు చేయించుకునే బాధితులకు అత్యవసర సమయంలో యువకులు స్పందిస్తూ రక్తదానం చేస్తున్నారని చెప్పారు. తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు మధ్యాహ్నం భోజనాన్ని మానవత సభ్యులు ఎస్.రామచంద్రరావు, పండ్లు, ప్రోటీన్ పౌడర్, స్వీటు గుర్రాల అఖిల్‌రెడ్డి (యూఎస్ఏ) ఏర్పాటు చేశారని తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేటీ సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, డాక్టర్ జీ స్పందన, టీ రామారావు, మానవత సభ్యులు రత్నాకరరావు, కేవీ రమణ పాల్గొన్నారు.

కాళ్ళకూరు వెంకన్న హుండీ ఆదాయం రూ.17 లక్షలు


కాళ్ళకూరు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గ్రామస్తులు, భక్తులు, దేవదాయ శాఖ అధికారులు శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం (భీమవరం) కార్యనిర్వహణ అధికారి దండు వెంకట కృష్ణంరాజు సమక్షంలో హుండీ తెరిచి లెక్కించారు. 83 రోజులకు గాను హుండీ ఆదాయం రూ:17,09,477 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్ తెలిపారు.

రైతులను నట్టేట ముంచిన చేపల వ్యాపారి..!

కాళ్ల: కాళ్ల మండలం మాలావానితిప్ప గ్రామానికి చెందిన చేపల వ్యాపారి చేపల రైతులను నట్టేట ముంచి పరారైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గత పదేళ్లుగా రైతుల దగ్గర చేపలు కొంటున్న వ్యాపారి గత రెండు రోజులుగా ఫోన్‌కు కూడా స్పందించుకపోవడంతో తాము మోసపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయనకు కూడా ఇదే వ్యాపారి రూ.5 కోట్లు బకాయి ఉన్నాడని తెలియడంతో రైతులు దిక్కుతోచక లబోదిబోమంటున్నారు. స్థానికంగా చుట్టుపక్కల రైతులకు సుమారు రూ.80 కోట్ల పైబడి బాకీలున్నట్లు తెలుస్తోంది. పరారీలో ఉన్న వ్యాపారి సోమవారం నుంచి అందుబాటులో లేరని, ఆ వ్యాపారి పేరు సతీష్‌గా చేపల రైతులు చెబుతున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని వీరమ్మకుంట గ్రామానికి కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు గ్రామ సమీపంలో వాహనాన్ని అడ్డుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. వాహన యజమాని, చెరువు యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పశుగ్రాసం కొరతను అధిగమించండి ఇలా..

- రైతులకు సాగుతోపాటు పశుపోషణతో ఆర్థిక తోడ్పాటు
- పప్పు జాతి పశుగ్రాసాలు సాగు మేలంటున్న వ్యవసాయ అధికారులు


మెట్టలో మామిడి తోటలో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో గడ్డి పండిస్తున్న రైతులు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో రైతులకు వ్యవసాయంతో పాటు పశుపోషణ ఆర్థికంగా తోడ్పాటునిస్తుంది. ఈ నేపథ్యంలో పశు పోషణలో పశుగ్రాసం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అయితే వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ దశలో గ్రామీణ ప్రాంతాల్లో పాడిని నమ్ముకున్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పవచ్చు. పశు పోషణలో 70 శాతం ఖర్చు మేతకే అవుతుందని తెలిసిందే.


పాటించాల్సిన మెలకువలు

పాడి పశువులను పెంచుకునే రైతులు పశుగ్రాసం పండించడంలో పాటించాల్సిన మెలకువలను వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ సూచిస్తున్నారు. పంట కోత తరువాత, పండ్ల తోటల్లోని మొక్కల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పప్పు జాతి పశుగ్రాసాలు అలసంద, ఉలవ, పిల్లిపెసర, జనుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం వల్ల పశుగ్రాసం కొరతను అధిగమించడంతో పాటు భూమిలో నత్రజని స్థిరీకరించబడి భూసారం పెరిగే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. వర్షాభావం ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను రైతులకు సరఫరా చేస్తోందని చెప్పారు.

జనుము : ఇది కాయజాతి పశుగ్రాసం. అన్ని నేలల్లోనూ అన్ని కాలాల్లో కొద్దిపాటి నీటితో కూడా పండించుకోవచ్చు. ఎకరానికి 12 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లాలి. విత్తిన తరువాత 40, 50 రోజులకు కోతకు వస్తుంది. ఈ మేతను పూత దశలో కోసి ఎండు మేతగా వినియోగించుకుంటే ఉపయోగం ఉంటుంది.

పిల్లి పెసర : వరి సాగు చేసే అన్ని భూముల్లో అంతర పంటగా దీన్ని సాగు చేసుకోవచ్చు. సాధారణ భూములకు పచ్చి రొట్టగా వాడితే భూమికి బలం చేకూరుతుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఏ కాలంలోనైనా ఈ పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసం వేర్లలో నత్రజని బుడిపెలు ఉండటం వల్ల భూమి సారవంతమవుతుంది. భూమిలో తేమ ఉన్నప్పుడే ఎకరానికి 10 - 15 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లుకోవాలి. 50 రోజుల్లో కోతకు వచ్చే ఈ పశుగ్రాసం వల్ల ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పచ్చి మేత లభిస్తుంది.

ఇతర రకాలు : ఇక పశుగ్రాస మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ రకం జె 1006-రకం, విజయ కాంపోజిట్ రకాలు 85 రోజులకు ఒకేసారి కోతకు వస్తాయి. పండ్ల తోటలు, పామాయిల్ తోటల్లో కూడా సాగు చేసుకోవచ్చు. రైతులకు అధిక పశుగ్రాస దిగుబడులను అందిస్తాయి. పప్పు జాతి రకాలైన అలసంద (బొబ్బర్లు) రష్యన్ జైంట్, బుందేల్ లోబియ 1, 2, ఇసి 4216-5287, కేబీసీ 2 మొదలైన రకాలు 55 నుంచి 60 రోజుల్లో ఒకే కోతలో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందిస్తాయి.


బి నాగకుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు, చింతలపూడి సబ్‌డివిజన్

చల్లచింతలపూడిలో చోరీపై కేసు నమోదు

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన దొంగతనంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొప్పన వెంకటేశ్వరరావు ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఊరు నుంచి వచ్చిన వెంకటేశ్వరరావు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న రూ.20 లక్షల నగదు, 5 కాసుల బంగారం పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి విచారణ చేస్తున్నామని, క్లూస్ టీమ్ సిబ్బంది విచారణ ప్రారంభించారని ఎస్సై స్వామి చెప్పారు. బుధవారం బాధితుడు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నీటి నిల్వ ప్రాంతాలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేస్తున్న మునిసిపల్ కమిషనర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలైన 13వ వార్డు కృష్ణుడు చెరువు, 15వ వార్డు సవిత్రుపేట మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేశారు. కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ దోమలు కుట్టుకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెత్తా చెదారాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని, తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, శానిటరీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను బాల కార్మికులుగా తయారు చేయవద్దు



రొక్కాల నాగబుజ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): చదువుకునే వయసులో పిల్లలను బడికి పంపాలని, వారిని బాల కార్మికులుగా తయారు చేయవద్దని ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో సంస్థ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నాగబుజ్జి మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న సందర్భంలో తల్లిదండ్రులు పిల్లలను తప్పక పాఠశాలలకు పంపాలని, బాగా చదివించాలన్నారు. సంపాదన కోసం పిల్లలను బాల కార్మికులుగా చేర్చవద్దని, పిల్లల హక్కులు కాపాడాలన్నారు. ఆదర్శ అకాడమి సిబ్బంది, ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ గృహాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



గూడెం సంక్షేమ బాలికల వసతిగృహంలో అధికారులతో మాట్లాడుతున్న శోభారాణి

పెంటపాడు: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని జిల్లా సాంఘీక సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి కోరారు. బుధవారం ఆమె పలు గూడెం ప్రాంతంలోని పలు సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతిగృహాలలో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. తణుకు సహాయ అధికారిణి నాగ సాయమ్మ, గూడెం అధికారి బీవీఎస్ రాజు, నియోజకవర్గంలోని ఆయా సంక్షేమ వసతిగృహాల వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల ఫలితాలు విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ జూన్ 7న కళాశాలలో జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షల్లో (ఇంటర్నెషిప్ ఎవెల్యూషన్) 272 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫలితాల్లో 98.53 శాతంతో 268 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో ఎస్వీకేపీ విద్యార్థుల ప్రతిభ

పెనుగొండ: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో కోచింగ్ తీసుకొన్న విద్యార్థుల్లో 70 శాతానికి పైగా విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రి కల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. ముగ్గురు విద్యార్థులు 10 వేల ర్యాంకుల లోపు, ముగ్గురు 20 వేల ర్యాంకులలోపు సాధించారన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం

భీమవరం అర్బన్: భీమవరం మండలం తోకతిప్ప గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తోకతిప్పలో సీపీఎం మండలశాఖ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్షితమంచినీరు ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయిలకు పంపిణీ చేస్తుండడంతో నీరు బురదగా వస్తున్నాయని, గ్రామస్తులు ఆ నీటిని తాగలేకపోతున్నారని చెప్పారు.

చిన్నారులు.. ఎత్తుకు పైఎత్తుల్లో దిట్టలు

చదరంగంలో రాణిస్తున్న వైనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన చిన్నారులు చదరంగంలో రాణిస్తున్నారు. పట్టుమని పదేళ్లు నిండని వీరు ఎత్తుకు పైఎత్తులతో ప్రత్యర్థులను ఓడిస్తున్నారు. మాస్టర్స్ చెస్ అకాడమీ వారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు తాడేపల్లిగూడెం పట్టణంలోని కె.ఎన్.రోడ్డు అకాడమీ ఇనిస్టిట్యూట్‌లో మే 1 నుంచి జూన్ 10 వరకు ఉదయం, సాయంత్రం సమయాలలోల్లో నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లల నుంచి పెద్దలు వరకు హాజరయ్యారు. సీనియర్, ఇంటర్నేషనల్ రేటెడ్ కోచ్ ఎస్.ఎస్. చంద్రశేఖర్, అసిస్టెంట్ కోచ్ వై.డి.ప్రసాద్, కోచ్ ఉమామహేశ్వరీలచే తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకులకు చెందిన సుమారు 40 మందికి క్రీడకారులకు చదరంగంలో వ్యూహాలు ఎలా రచించాలి, ఎత్తుగడలు ఎలా వేయ్యాలో వివిధ అంశాలపై మెలకువలు నేర్పించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలా ఆడాలి అనే అంశాలపై శిక్షణ సాగింది. ఈ క్యాంపులో ఐదు సంవత్సరాలు చిన్నారులు సైతం శిక్షణ అందుకున్నారు. అనంతరం పోటీలు నిర్వహించి, జ్ఞాపికలు, ప్రశంశాపత్రాలు అందజేశారు.



చదరంగం పోటీలలో పాల్గొన్న చిన్నారులు

రాష్ట్ర స్థాయిలో పతకాలు



చదరంగం మెదడకు పదును పెట్టే ఆట అని నిర్వాహకులు తెలిపారు. అందుకే నేర్చుకున్నాను. నెల్లూరు, విశాఖపట్నంలలో జరిగిన టోర్నమెంట్‌లలో ఆడి రెండోవ, మూడోవ స్థానాలు సాధించాను. గత రెండు సంవత్సరాలుగా సమ్మర్ క్యాంప్‌కు హాజరవుతున్నాను. ఆన్‌లైన్ టోర్నమెంట్‌లలో సైతం ప్రతిభ చూపాను. గ్రాండ్ మాస్టర్ అవ్వాలని ఉంది.

– ఎస్.రుత్విక్ రెడ్డి, చెస్ క్రీడాకారుడు, పెంటపాడు

వయసుతో సంబంధం లేదు



చదరంగం అనేది మెదడుకు సంబంధించిన ఆట, వయసుతో పనిలేదు. ఎత్తు వేయడంలో చురుగ్గా ఉండాలి. మొదటిసారిగా ఈ వేసవిలో 45 రోజుల పాటు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో శిక్షణ తీసుకున్నాను. కోచ్ శిక్షణ, సూచనలు, సలహాలతో పాటు సీనియర్స్ వద్ద వ్యూహాలు ఎలా రచించాలో తెలుసుకున్నాను. ఇటీవల శిక్షణ ముగింపులో జరిగిన పోటీలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఓడించాను. అండర్–7 జాతీయ స్థాయి పోటీలకు వెళ్లి ఛాంపియన్ షిప్ సాధిస్తాను.

– కె.హిల్, చెస్ క్రీడాకారుడు, తాడేపల్లిగూడెం

వ్యూహాత్మక కళా నైపుణ్యమే చదరంగం



మేధాశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మక కళ నైపుణ్యమే చదరంగం. ఈ క్రీడను ఆడేందుకు చిన్నారుల దగ్గర నుంచి, యువతీ, యువకులు, వృద్ధులు, అన్ని వయస్సులు వారు పోటీ పడుతున్నారు. ఇతర కోచ్‌లు సహాయంతో ఉచిత శిబిరాలు నిర్వహించి ఎంతో మంది క్రీడాకారులను తయారు చేస్తున్నాం. జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలలో రాణించే విధంగా వారిని తీర్చిదిద్దుతున్నాము. ఉచిత శిబిరాలను నిర్వహించేందుకు మాస్టర్ చెస్ అకాడమిక్ చైర్మన్ సీహెచ్ఏఆర్‌కే వర్మ, ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్‌లు సహాయ సహకారాలు ఎంతగానో అందుతున్నాయి.

– సీనియర్ ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్, కోచ్ చంద్రశేఖర్

మలేరియాను నిర్మూలిద్దాం

మొగల్తూరు: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఒ.దినేష్ సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మలేరియాను నిర్మూలించాలంటే ముందుగా దోమల లార్వాను నిర్మూలించాలన్నారు. ఇంటి ఆవరణలో పనికి రాని వస్తువుల్లోనూ, పాత టైర్లల్లోనూ, లేదా మురుగు నీరు నిలిచిపోయినా దోమలు పెరిగిపోతాయన్నారు. దోమల నుంచి లార్వా ప్రభలుతుందని, అవి కుట్టడం ద్వారానే జ్వరాలు వస్తాయన్నారు. ఎవరికైనా జ్వరం లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రతించాలన్నారు. దోమలు కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గుండెపోటుతో రంగారెడ్డి మృతి

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏ1 కాంట్రాక్టర్ ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి సోదరుడు హైదరబాద్‌లోని గ్లోబల్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత ద్వారంపూడి మురళీకృష్ణ రంగారెడ్డి (57) బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు ఆయన స్వగ్రామం నత్తారామేశ్వరం గ్రామంలో గురువారం ఉదయం జరుగుతాయని ఆయన బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పిడుగుల వానతో జాగ్రత్త





వర్షం వచ్చే ముందు పిడుగుల దృశ్యాలు

- కర్షకులపై పడుతున్న పిడుగులు
- జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణుల సూచన

పెంటపాడు: ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు, సంభవిస్తున్నాయి. ఉరుములతో కూడిన వర్షం, పిడుగులు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు, నిర్వహణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఏ ప్రాంతంలో పిడుగులు పడతాయోనని ఒక అరగంట ముందే ఆ ప్రాంతంలో గల సెల్‌ఫోన్‌లకు విపత్తు, నిర్వహణశాఖ వారు మెసేజ్‌లు పెడుతున్నారు. ముఖ్యంగా పిడుగులు పడే సమయంలో సెల్‌ఫోన్‌లు వినియోగించేవారు ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షం వచ్చే సమయంలో ఉరుములు, పిడుగులపాటు వల్ల విడుదలయ్యే పెద్దపెద్ద ధ్వనులు, వెలుతురుతో పాటు విద్యుత్ శక్తి విడుదలవుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుపాటు బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశాల నుంచి నేరుగా భూమిలోకి లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని ఏర్పాటు చేసుకోవడం వలన పిడుగులో ఉన్న విద్యుదావేశం భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఎత్తైన కట్టడాలు చేసినప్పుడు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

అప్రమత్తతే శ్రీరామరక్ష

మెరుపులు, ఉరుములు వచ్చే సమయంలో చెవులు గట్టిగా మూసుకోవాలి. పిడుగు శబ్దంతో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఉరుములు, మెరుపులు సమయంలో సురక్షిత ప్రాంతానికి వెళ్లే అవకాశం లేకపోతే నేలమీదకు పూర్తిగా కిందకు వంగాలి. నేలపై పడుకోకూడదు. నేలపై కూర్చున్నప్పుడు పాదాల ముందుభాగం మాత్రమే నేలను తాకాలి. శరీరంలో మరే ఇతర భాగం నేలను తాకకుండా చూసుకోవాలి. పాదాల మడమల ముందు ఒకదానిని ఒకటి తాకేలా ఉండాలి. అలా చేయడం వల్ల పిడుగుపడే సమయంలో నేలపై పడి దాని విద్యుత్ శక్తి ఒక పాదం నుంచి శరీరంలోకి ప్రవేశించినా వెంటనే రెండో పాదం నుంచి తిరిగి భూమిలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోకి విద్యుత్ ప్రవహించే అవకాశాలు తగ్గుతాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతోపాటు క్యూములో నింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగాఉండాలి. వర్షం వస్తున్నట్లు ముందే తెలుస్తుంది. కాబట్టి వీలైనంత వరకు ఇంటినుంచి బయటకువెళ్లకుండా ఉంటే మంచిదని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

మంచినీటి చెరువు నింపే పనుల ప్రారంభం

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ మంచినీటి చెరువును నింపే పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ప్రధాన పంట కాలువకు నీటిని విడుదల చేయడంతో కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువులో నీటిని నింపే పనులు దీంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి భారీ విస్తీర్ణంలో చెరువు అందుబాటులో ఉంది కాబట్టి 40 రోజులకు సరిపడా నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. వేసవిలో కూడా రెండు పూటలా నీరు ఇవ్వగలిగామన్నారు. ఇప్పుడు కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువులోకి నింపుతున్నామని చెప్పారు. చెరువు నింపే పనులు త్వరితగతిన పూర్తి చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వైసు నీల్, మల్లాడి బుజ్జి పాల్గొన్నారు.



చెరువు నింపే పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ

ప్రీస్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్స్‌కు..

పెనుమంట్ర: మండలంలోని వివిధ అంగన్‌వాడీ స్కూల్స్‌కు చెందిన ప్రీస్కూల్ విద్యార్థులను ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం చేర్పించారు. అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ విద్యను పూర్తిచేసిన 5 ఏళ్లు నిండిన బాలబాలికలకు సర్టిఫికెట్లు ఇచ్చి జాయినింగ్ కోసం ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. పెనుమంట్ర గ్రామంలో 8 అంగన్‌వాడీలకు చెందిన విద్యార్థులను ఆయా అంగన్‌వాడీ టీచర్స్ పి.శాంతి, ఎన్.అరుణకుమారి, ఎ.వెంకటలక్ష్మి, కె.మంగాయమ్మ, పి.సత్యవేణి, ఎన్.వెంకటరత్నం, బి.సుజాత, టీవీ సుబ్బలక్ష్మి తదితరులు తమ పరిధిలోని పిల్లలను ప్రైమరీ పాఠశాలల్లో జాయిన్ చేశారు.



విద్యార్థులను ప్రైమరీ స్కూల్స్‌కు సిద్ధం చేసిన అంగన్‌వాడీ టీచర్లు

సీఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎల్ఈడీ తెర ఏర్పాటు చేసి, అధికారులు, ప్రజలు సీఎం చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వెంకటేష్, వెలుగు ఏపీఎం లక్ష్మి పాల్గొన్నారు.

వంతెన మార్గం ప్రమాదకరం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ,ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు కూడా శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వంతెనమార్గం

నేడు అలంపురంలో ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ సేవా ఛారిటీ ఆస్పత్రిలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు పలువురు ప్రముఖ వైద్యులతో ఆరోగ్యసేవలు ఉచితంగా అందించనున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు జనరల్‌మెడిసన్, అంకాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వైద్యులు, సంబంధించి వైద్యులు, చర్మవైద్యనిపుణులు వైద్యపరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి ప్రారంభించబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

నీరుగారుతున్న వాల్టా చట్టం



వేండ్ర అగ్రహారంలో రోడ్డులో చెట్లను నరికి వేసిన దృశ్యం

పాలకోడేరు: పర్యావరణ పరిరక్షణకు ప్రకృతిని కాపాడుకోవడంఅవసరం. అందుకోసమే ప్రభుత్వం వాల్టా చట్టం అమలు చేస్తోంది. ఈ చట్టం ప్రకారం నీరు, భూమి, చెట్లను రక్షించాల్సిన ఆవశ్యకత ప్రతి వారి పైనా ఉంది. అయితే అనేక చోట్ల ఈ చట్టాన్ని ఉల్లంఘించి చెట్లను విచక్షణా రహితంగా నరికి వేస్తున్నారు. పాలకోడేరు మండలంలోని వేండ్ర అగ్రహారం, విస్సాకోడేరు, మోగల్లు గ్రామాల్లో గత కొద్ది రోజులుగా సుమారు వంద తాడి చెట్లను నరికి వేశారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు.

సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంతో పాటుగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ నరసాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ షేక్ బులిమస్తాన్ గురువారం రాజీనామా చేశారు. రాజీనామాను సొసైటీ కార్యదర్శి ఎం.శ్రీనివాసబాబుకు అందించారు. ఏడాది క్రితం సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమిస్తూ చైర్మన్‌గా బులిమస్తాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. చైర్మన్ బులిమస్తాన్‌తో పాటుగా సభ్యులు చల్లా సత్యనారాయణ, మైలాబత్తుల మరియమ్మ కూడా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బులిమస్తాన్ మాట్లాడుతూ 104 ఏళ్ల చరిత్ర కలిగిన సొసైటీకి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఇచ్చారన్నారు. ఆయనతో పాటు సొసైటీ ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు. భవిష్యత్‌లో సొసైటీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

బడికి వేళాయె..

- పాఠ్య పుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం
- నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి



తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్

తణుకు అర్బన్: వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలన్నీ గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో అమలు చేసిన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. ఇందులో భాగంగా పునఃప్రారంభం రోజునే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితం నేడు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పుస్తకాలు అందనున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు విద్యార్థులకు పాఠశాలలు తెరిచి 3, 4 నెలలైన తరువాత అరకొర పుస్తకాల పంపిణీ చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పుస్తకాలకు ఎటువంటి కొరత లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. నాణ్యమైన విద్య, తరగతి గదులు, భోజనంతో పాటు పుస్తకాలు పంపిణీ, విద్యకు సంబంధించి అన్ని అంశాలు నూరు శాతం ఫలితాలు వచ్చేలా అమలు చేయడం వాటిని పర్యవేక్షించడం రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా ప్రకటించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో సైతం బాధ్యత, అంకితభావం పెరిగింది. పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నియోజకవర్గంలో అన్ని మండలాల ఎంఈఓ కార్యాలయాలకు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వాటిని ఎంఈఓలు, పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ అమలుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మండలాల ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. తణుకు నియోజకవర్గంలో 2018–19 సంవత్సరంలో 14489 మంది విద్యార్థులు ఉండగా గతేడా ది ఆ సంఖ్య 15811 మందికి చేరింది. ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లుగా విద్యాశాఖాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



తణుకు నంబరు 14 మునిసిపల్ పాఠశాల



తణుకులో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిన నోటు పుస్తకములు